## క్లుప్తంగా

### నేడు రామాలయంలో చండీహోమం పూర్ణాహుతి

**నల్లకుంట:** విజయ ఏకాదశిని పురస్కరించుకుని నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో సరస్వతి అమ్మవారికి విశేష పూజలు ఉంటాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి జయంతి బుధవారం ప్రకటించారు. గురువారం ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో 'చండీహోమం, పూర్ణాహుతి' ఉంటుందని భక్తులు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ వేడుకల్లో పాల్గొనాలని ఈఓ పేర్కొన్నారు.

### ఏడుపాయల జాతరకు ప్రత్యేక బస్సులు

**కాచిగూడ:** మహాశివరాత్రి సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ కాచిగూడ డిపో ఆధ్వర్యంలో ఏడుపాయల జాతరకు ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు గౌలిగూడ, సీబీఎస్ నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు హైదరాబాద్ రీజనల్ మేనేజర్ వరప్రసాద్ ప్రకటించారు. బుధవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమన్నారు.

- ఈ నెల 17 నుంచి ప్రతి గంటకు ఒక్కటి చొప్పున 10 బస్సులు, 18న 30 బస్సులు, 19 న ప్రతి 15 నిమిషాలకు ఒకటి చొప్పున 40 బస్సులు, 20వ తేదీన 20 నిమిషాలకు ఒక్కటి చొప్పున 30 బస్సులు, 21 న ప్రతీ గంటకు ఒక్కటి చొప్పున 15 బస్సులను నడుపుతున్నట్లు వివరించారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### జన్మదిన వేడుకలు



**కాచిగూడ:** పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య పుట్టిన రోజు సందర్భంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ నేతలు ఎస్పీ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నేతలు అభిషేక్‌రెడ్డి, రావుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### వీధి లైట్ల సమస్య పరిష్కారానికి కృషి

**చిక్కడపల్లి:** వీధి లైట్ల సమస్య పరిష్కారానికి తాము శాయశక్తుల కృషి చేస్తున్నామని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అన్నారు. బుధవారం గాంధీనగర్ డివిజన్, ఎస్‌బీఐ కాలనీ స్ట్రీట్ నంబర్ 8లో నూతనంగా వీధి లైట్ల స్తంభం ఏర్పాటును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పాత స్తంభాలు తుప్పు పట్టి గత కొంతకాలంగా ఉన్న వాటిని తొలగించి కొత్త వాటిని వేయించామన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఏడీ వెంకటరమణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ యువ నాయకులు వినయ్‌కుమార్, నవీన్‌కుమార్, రాజేందర్, రఘుయాదవ్, వీధి లైట్ల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### 23 నుంచి ఏఐఎఫ్‌బీ మహాసభలు

**లిబర్టీ:** ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) 19వ జాతీయ మహాసభలో హైదరాబాద్‌లో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తామని ఫార్వర్డ్ బ్లాక్ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ బి.రాములు యాదవ్ వెల్లడించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధులు హాజరవుతారన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై నాలుగు రోజుల పాటు చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణను ఖరారు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు టి.విజయలక్ష్మి, ఆసిఫ్, అబ్దుల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### 'ప్రజలు నూతన నాయకత్వాన్ని కోరుకుంటున్నారు'

**లిబర్టీ:** పార్లమెంటు నుంచి పంచాయతీ వరకు ప్రజలు మార్పును కోరుకుంటున్నారని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షురాలు శివలెంక ఉదయలక్ష్మి అన్నారు. తాము ప్రధాన రాజకీయ పక్షాలకు ధీటుగా ఎదుగుతామని స్పష్టం చేశారు. ఇండియన్ ప్రజా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం లిబర్టీ వద్ద ఉన్న లిబర్టీ ప్లాజాలోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయలక్ష్మి మాట్లాడుతూ, రాజకీయాలు, పాలనలో ప్రజలు నూతన నాయకత్వం కావాలని కోరుకుంటున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న తిరోగమన విధానాలపై పోరాటాలు సాగిస్తామన్నారు. సమావేశంలో నిస్సార్ భాషా వి.శ్రీనివాసరావు, అరుణ్‌రెడ్డి, నంది కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల జీవితం మార్గదర్శకం



డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్, బీజేఆర్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

**కవాడిగూడ:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జీవితాలు నేటి తరానికి మార్గదర్శకమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సామాన్య కుటుంబంలో జన్మించి బీఆర్ అంబేడ్కర్ అత్యున్నత భారత రాజ్యాంగాన్ని రచించారని ఆయన కొనియాడారు. ఉప ప్రధానిగా దళితులలో చైతన్యం తీసుకొచ్చిన ఘనత బాబు జగ్జీవన్‌రామ్‌కు దక్కుతుందని వీరిద్దరి సేవలను భారతజాతి ఎప్పటికీ మరచిపోదన్నారు. బుధవారం కవాడిగూడ డివిజన్‌లోని ముగ్గు బస్తీలో బస్తీ కమిటీ అధ్యక్షుడు కరివేపాకు కృష్ణ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలను స్థానిక కార్పొరేటర్ రచనశ్రీతో కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆవిష్కరించారు.

- ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ మేధావిగా అంబేడ్కర్‌ను గుర్తించారని ఐక్యరాజ్య సమితిలో ఆయన జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం భారత జాతికి గర్వకారణమన్నారు.
- ఉప ప్రధానిగా సేవలందించడమే గాక అణగారిన వర్గాలలో చైతన్యం తీసుకొచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత బాబు జగ్జీవన్‌రామ్‌కు దక్కుతుందన్నారు.
- అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌ల సందేశాలను దళితులు ముందుకు తీసుకెళ్లి వారి ఆశయ సాధనకు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌గౌడ్, కమిటీ నేతలు ఆశోక్, బిక్షపతి, రాజు, అరుణ్, లక్ష్మణ్, విశ్వనాథ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్ యాదవ్, ఎన్‌డీ సాయికృష్ణ, నగర నాయకులు శ్రీనివాస్‌యాదవ్, రాజశేఖర్‌గౌడ్, జమాలుద్దీన్, శ్రీహరి, రవియాదవ్, బీజేపీ నేతలు వెంకటేష్, కాంగ్రెస్ నేతలు లక్ష్మణ్, ధర్మేందర్, బీఆర్ఎస్ నేతలు యాదగిరి, రాజేష్ తదితరులున్నారు.

## పార్కుల అభివృద్ధికి కృషి



ఆధునీకరణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ లావణ్య తదితరులు

**అంబర్‌పేట:** నియోజకవర్గంలో పార్కుల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కార్యచరణతో కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం గోల్నాక డివిజన్ తులసీనగర్ పార్కును రూ.33.80 లక్షల అంచనా వ్యయంతో ఆధునీకరణకు కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అన్ని కాలనీల్లో ఉన్న పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. స్థానిక కాలనీవాసులతో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**అంబర్‌పేట్ డివిజన్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర..**

- డివిజన్‌లో పరిధిలో స్థానిక కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రజా సమస్యలపై పాదయాత్ర నిర్వహించారు. డ్రైనేజీ, వీధిలైట్లు, పారిశుద్ధ్యం తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్ నాయకులు సిద్ధార్థముదిరాజ్, సంతోష్, శ్రీనివాస్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సమాజానికి సేవ చేసేవారు ఉన్నత స్థానంలో ఉండాలి



కేవీ రమణాచారిని సన్మానిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**చిక్కడపల్లి:** సమాజానికి సేవ చేసే వారు ఉన్నత స్థానంలో ఉండాలని రాష్ట్ర పర్యాటకశాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. బుధవారం త్యాగరాయగానసభలో ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి జన్మదిన సప్తాహంలో త్యాగరాజస్వామి కీర్తనలు, కూచిపూడి నృత్యంతో సభికులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. తెలంగాణ గడ్డపై పుట్టిన రమణాచారి తెలుగువారందరికీ ఆత్మ బంధువు అని కొనియాడారు. జీవితం హోదాల కోసం కాక సివిల్ సర్వీస్‌కు పోటీపడే వారు సామాజిక సేవ కోసమే రావాలని రమణాచారి అన్నారు. జీవిత కాలంలో ఎంతమందికి మనం మేలు చేశామని ప్రశ్నించుకుంటే ఆ జీవితం సార్థకమని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు లయన్ డాక్టర్ ఎస్పీ భారతి పాల్గొన్నారు.

## 'హాత్‌సే హాత్ జోడో'కు విశేష స్పందన



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు

**కవాడిగూడ:** ముషీరాబాద్ నియోజకవర్గం కవాడిగూడలో నిర్వహిస్తున్న 'హాత్ సే హాత్ జోడో' యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఈ యాత్రలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటికీ వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తున్నామన్నారు. బుధవారం డివిజన్‌లోని భీమామైదాన్, గుడాల బస్తీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి 'హాత్ సే హాత్ జోడో' యాత్ర కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. కవాడిగూడలో ఎక్కడకు వెళ్లినా డ్రైనేజీ, తాగునీటి సమస్యలతో పాటు పింఛన్లు రావడం లేదని ఫిర్యాదులు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తుండగా తెలంగాణ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. టీపీసీసీ రాష్ట్ర నాయకులు శ్రీరాముల యాదగిరి, ముషీరాబాద్ ఎ-బ్లాక్ అధ్యక్షుడు కృష్ణ, నగర నాయకులు లక్ష్మణ్, పాశం అనిల్‌కుమార్, చంద్రశేఖర్, ప్రభాకర్, సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు ధర్మేందర్, మాజీ అధ్యక్షుడు సాయిబాబా, బాబురావు, భాస్కర్, గుర్రం శంకర్, మేడి సురేష్‌కుమార్, అభిషేక్ కెనడీ తదితరులు పాల్గొన్నారు.

### సన్మానం



**నల్లకుంట:** కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'ఆదర్శ వివాహితుల ఆత్మీయ సమ్మేళనం' జరిగింది. ఈ సందర్భంగా బుధవారం ఆదర్శ వివాహితుడైన గాడ్గేబాబా దళిత సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ స్వామి అల్వాల్‌ను ఓయూ ప్రొఫెసర్ కాశీం శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

### స్వచ్ఛ భారత్ ర్యాలీ




**కాచిగూడ:** పరిసరాలను పరిశుభ్రత అందరి బాధ్యత అని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ అన్నారు. బుధవారం కాచిగూడ డివిజన్ చెప్పల్‌బజార్, మోతీమార్కెట్ తదితర ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి స్వచ్ఛభారత్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇష్టానుసారంగా చెత్తను రోడ్లపై పారవేయవద్దని ప్రజలకు సూచించారు. చెత్త సేకరణ కోసం ఇంటింటికీ వచ్చే స్వచ్ఛ ఆటోల సిబ్బందికి అందజేయాలన్నారు. స్వచ్ఛత పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జీహెచ్ఎంసీ ఎస్ఎస్ తిరుపతి, ఎస్ఎఫ్ఏలు అమరేశ్వరి, రామారావు, విష్ణు, దేవా, ప్రదీప్‌రెడ్డి, శ్రవంతి, సుధాకర్, రేణుక, భార్గవి, పూజ, బీజేపీ నేతలు భీమ్‌రాజ్, రవియాదవ్, బాలప్రసాద్, సూరి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## శివాజీ జయంతిని జాతీయసెలవు దినంగా ప్రకటించాలి



కాచిగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**కాచిగూడ:** ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి ఫిబ్రవరి 19న జాతీయసెలవు దినంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సుదర్శన్ డిమాండ్ చేశారు. శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా బుధవారం కాచిగూడలో శివసేన పార్టీ అధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శివాజీ జయంతిని అధికారికంగా నిర్వహించాలన్నారు. భారతదేశ ప్రతిభ, ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పి ఆదర్శంగా నిలిచిన గొప్ప వీరుడని కొనియాడారు. యువసేన రాష్ట్ర అధ్యక్షుడు గణేష్, అన్నారావు, నాగనాథ్, చంద్రకాంత్, ప్రతాప్‌రెడ్డి, అవినాష్, బాలాజీ, త్రిభువన్, కాబ్రా, మధుకర్, మహదేవ్, మారుతీ, కిషన్, సచిన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మకుమారీస్ మహాశివరాత్రి కరపత్రం ఆవిష్కరణ

**చిక్కడపల్లి:** బ్రహ్మకుమారీస్ చిక్కడపల్లి శాఖ ఆధ్వర్యంలో ఈరోజు నుంచి 18 వరకు మహాశివరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శాఖ ఇన్‌చార్జి జయశ్రీ ప్రకటించారు. చిక్కడపల్లిలోని బ్రహ్మకుమారీస్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కరపత్రాన్ని ఆమె ఆవిష్కరించారు. అశోక్‌నగర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాంగణంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రుద్రాక్ష శివలింగ దివ్య దర్శనం భక్తులకు కలగజేస్తున్నామన్నారు. మహాశివరాత్రి మహత్యం, ఆధ్యాత్మిక రహస్యాలు, ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆధ్యాత్మిక చిత్ర ప్రదర్శన, రాజ యోగానుభూతి, దీపప్రజ్వలన తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ డా.కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ తదితరులు హాజరై ప్రారంభిస్తారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 130 దేశాల్లో ఉన్న 10 వేల బ్రహ్మకుమారీల శాఖలలో కూడా ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తామని వివరించారు. బ్రహ్మకుమారీలు విశ్వనాథన్, రష్మిత, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నతనంలోనే సృజనాత్మకతను వెలికితీయాలి



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** చిన్నారుల్లో దాగిఉన్న సృజనాత్మకతను, కళాత్మక శక్తి సామర్థ్యాలను చిన్నతనంలోనే గుర్తించి, వెలికి తీయాలని బచ్‌పన్ స్కూల్స్ రీజినల్ డైరెక్టర్ (అకాడమిక్) రూపారెడ్డి అన్నారు. బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కళాభవన్‌లో డీడీకాలనీ, గాంధీనగర్, మేడిపల్లి, ఉప్పల్, బోడుప్పల్ ప్రాంతాలకు చెందిన బచ్‌పన్, అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్స్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తులో ఏ రంగంలోనైనా ప్రవేశించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారో గుర్తించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఆపరేషన్ అండ్ టెక్నికల్ రీజినల్ డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి, సునీత, గీతాంజలి, విజయ్‌కుమార్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### సామాజిక సేవలోనే నిజమైన సంతృప్తి

**కాచిగూడ:** సామాజిక సేవలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని హెల్ టాటా మణి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు కాకుమాను లూర్డు జ్యోతి అన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అర్బన్ హోమ్ లెస్ ఉమెన్ ఓల్డ్ ఏజ్ హోమ్' లో మహిళలకు ఆమె చీరలను పంపిణీ చేశారు. పేద ప్రజలకు సేవలందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆమె కోరారు. పోలంకి ఉషారాణి, ప్రేమలత, సునితరెడ్డి, రమణయాదవ్, యాదమ్మ, రాణి, జగదాంబ, పూల్ శ్రీదేవి, ప్రతిభ, జయమ్మ, పద్మావతి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

### రైల్వే ప్లాట్ ఫామ్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి

**కాచిగూడ:** రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్- 4పై ఓ గుర్తు తెలియని వ్యక్తి (70) అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహాన్ని కాచిగూడ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై తెలుపు, నలుపు రంగు చొక్కా, పసుపు రంగు లుంగీ ఉంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

**అడ్డగుట్ట:** సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని కేసీఆర్ వీరాభిమాన సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. బుధవారం సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పాలడుగు గండయ్య, ప్రధాన కార్యదర్శి టీ. ప్రవీణ్ కుమార్, సంఘం సభ్యులతో వెళ్లి డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌ను కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

### అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

**ఉస్మానియా యూనివర్సిటీ:** హైదరాబాద్ విమోచన ఉద్యమంపై బుధవారం ఓయులో అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. సంస్కృతం, హిందీ, మరాఠీ, కన్నడం విభాగాలతో స్వాతంత్ర్య సమరయోధుడు గంగారాం స్మారక్ మంచ్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఆర్ట్స్ కాలేజీలోని 133వ ఈ-క్లాస్ రూంలో హైదరాబాద్ ముక్తి ఆందోళన్ కే స్వతంత్ర సేనాని, ఇండియా భాషలు అనే అంశం జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ ప్రొ.గణేష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మహారాష్ట్రకు చెందిన మహేంద్రగోపాల్ హాజరై జ్యోతి ప్రసంగించారు. బన్సీలాల్, శ్యాంలాల్, మహాత్మా నారాయణ స్వామి, నారాయణ్‌రావు పవార్ పాల్గొన్నారు.

## త్రిపురలో వామపక్షాలపై దాడులను అరికట్టాలి




సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం తదితరులు

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** త్రిపురలో వామపక్షాలపై హింసా దాడులను అరికట్టాలని తెలంగాణ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. త్రిపురలో ప్రజాస్వామ్యయుతంగా, స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు. త్రిపురలో అధికారంలో ఉన్నామనే అహంకారంతో అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్షాలు లేకుండా చేయాలని బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు నర్సింహరావు, దశరథ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 'త్యాగాల పునాదులపై అధికారంలోకి వచ్చారు'



బీజేపీ కార్యాలయ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న డాక్టర్ కె.లక్ష్మణ్

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** సీఎం కేసీఆర్ త్యాగాల పునాదుల మీద అధికారంలోకి వచ్చి గడీల రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారని రాజ్యసభ సభ్యులు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. నేడు పాలన అంతా ఫామ్‌హౌజ్‌కే పరిమితమైందని ఎద్దేవా చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో రాంనగర్‌డివిజన్ కార్పొరేటర్ రవిచారి ఆధ్వర్యంలో డివిజన్‌కు చెందిన బీజేపీ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత 8 ఏళ్లుగా ప్రజలకు అరచేతిలో వైకుంఠాన్ని చూపిస్తున్నారే తప్పా ప్రజలకు సరైన పాలన అందించడం లేదన్నారు. హుస్సేన్‌సాగర్‌ను కొబ్బరి నీళ్లతో నింపుతామని ప్రగల్భాలు పలికారని నేడు రాష్ట్రంలో ఐదు లక్షల కోట్ల వరకు పైగా అప్పులు చేశారని ఆరోపించారు. పుట్టబోయే బిడ్డ మీద కూడా అప్పు భారాన్ని మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిధులు గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లకు తరలిపోతున్నాయని విమర్శించారు. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌కు మారినంత మాత్రాన ప్రజలు మిమల్ని గుర్తించరని ఎద్దేవా చేశారు. కార్పొరేటర్లు రవిచారి, రచనశ్రీ, మహాలక్ష్మి, నియోజకవర్గ కన్వీనర్ రమేష్‌రాం, కె.ఉపేందర్, రమా, గడ్డం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## 'అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపాలి'



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.గౌతంరావు

**నల్లకుంట:** అవినీతి మయంగా మారిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపాల్సిన అవసరం ఉందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బుధవారం నల్లకుంట డివిజన్ సంజీవయ్యనగర్‌లో 'ప్రజా గోస- బీజేపీ భరోసా' శక్తి కేంద్రం కార్నర్ సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన నల్లకుంట కార్పొరేటర్ అమృతతో కలిసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, యువతకు ఉద్యోగాలు, దళితులకు మూడెకరాల భూమి లాంటి అనేక హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు గుప్పించడం, రాజకీయ లబ్ధి పొందడం తప్ప కేసీఆర్ చేసిందేమి లేదని విమర్శించారు. మోసపూరిత వాగ్దానాలతో 9 ఏళ్లు గడిచిపోయిందన్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం చేసిన పోరాటంలో బీజేపీదే కీలకపాత్ర అన్నారు. రైతుల కోసం ఎప్పుడో మూతపడ్డ రామగుండం ఎరువుల కర్మాగారాన్ని రూ. 6,300 కోట్లతో పునః ప్రారంభం, ఎయిమ్స్ ఆస్పత్రి ఏర్పాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఘనతేనని పేర్కొన్నారు. బీజేపీ జోగులాంబ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు వనం రమేష్, ప్రముఖ్ నాయకులు ప్రదీప్, సహ ప్రముఖ్ సుమన్, దీపక్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

**మౌలిక సదుపాయల కల్పనలో విఫలం..**

**అంబర్‌పేట:** నియోజకవర్గంలో ప్రజా సమస్యలను బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసి అనైతిక రాజకీయాలకు పాల్పడుతుందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు విమర్శించారు. గతంలో బీజేపీ ఎమ్మెల్యేగా కిషన్‌రెడ్డి ఉన్నప్పుడు నియోజకవర్గంలో అభివృద్ధితో పాటు ప్రజలు ఎంతో సౌకర్యంగా ఉన్నారన్నారు. దీనికి భిన్నంగా ప్రస్తుత పరిస్థితులు నియోజకవర్గంలో నెలకొన్నాయన్నారు. బుధవారం అంబర్‌పేట డివిజన్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మౌలిక సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతుందని విమర్శించారు. బీజేపీ ప్రజా సమస్యలపై పోరాడుతుందని ఆయన స్పష్టం చేవారు. బీజేపీ నాయకులు భూషణ్‌చారి, ఆనంద్‌గౌడ్, యశ్వంత్, అయోధ్య రాములు, యాదగిరి, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు



పైప్‌లైన్‌లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అమృత

**నల్లకుంట:** తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని నల్లకుంట కార్పొరేటర్ అమృత జలమండలి అధికారులకు సూచించారు. కొన్ని ప్రాంతాల్లో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన వాటర్ పైపులైన్‌లు శిథిలావస్థకు చేరి లీకేజీలు వస్తున్నాయన్నారు. వాటి స్థానంలో కొత్త పైపులు వేయించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని బాయమ్మ గల్లీ, గోల్నాక మార్కెట్ పరిసర ప్రాంతాల్లో పైపుల లీకేజీలతో నీటి సరఫరాకు సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ బుధవారం సాయంత్రం జలమండలి అధికారులతో కలిసి పర్యటించి జలమండలి సిబ్బందితో మరమ్మతులు చేయించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. పగిలిన పైపులకు వెంటనే మరమ్మతుల చేపట్టి నీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, బీజేపీ సెంట్రల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేజే బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఓయూ జిల్లా పీజీ కాలేజీల్లో ప్రిన్సిపల్ పదవి రద్దు

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ పరిధిలోని జిల్లా పీజీ కాలేజీల ప్రిన్సిపల్ పదవులను రద్దు చేశారు. వర్సిటీ పరిధిలోని సిద్దిపేట, జోగిపేట, వికారాబాద్, నర్సాపూర్, మిర్జాపూర్‌లలో ఐదు జిల్లా పీజీ కాలేజీలు కొనసాగుతున్నాయి. నగరానికి దూరంగా ఉండటంతో పర్మనెంట్ అధ్యాపకులు జిల్లా కాలేజీల్లో పని చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో కొన్ని ఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను ప్రిన్సిపల్స్‌గా నియమిస్తున్నారు. కాంట్రాక్టు అధ్యాపకులకు ప్రిన్సిపల్ పదవులను రద్దు చేసి కోఆర్డినేటర్లను నియమించారు. అయినా ప్రిన్సిపల్స్ విధులు కోఆర్డినేటర్ల నిర్వహిస్తున్నారు. అయితే.. కోఆర్డినేటర్‌గా చేసే సంతకాలు చెల్లకపోవడంతో బస్‌పాస్‌లు, స్టడీ సర్టిఫికెట్లు, టీసీలు, స్కాలర్‌షిప్‌లు తదితర దరఖాస్తులు తిరస్కరణకు గురవుతుండటంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందు చూపు లేకుండా ఓయూ అధికారులు తీసుకున్న ప్రిన్సిపల్ పదవుల రద్దుతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కోఆర్డినేటర్ల సంతకాలు కేవలం ఓయూ కార్యాకాలపాలకు మాత్రమే చెల్లుతున్నాయి. ఈ విషయాన్ని ఓయూ అధికారులకు దృష్టికి తీసుకురాగా కోఆర్డినేటర్‌గా కొనసాగుతూనే ప్రిన్సిపల్‌గా సంతకం చేయాలని సూచించారు. ఇందుకు అంగీకరించని కాంట్రాక్టు అధ్యాపకులు కోఆర్డినేటర్లు తమ పదవుల రాజీనామాలకు సిద్ధపడుతున్నారు. విద్యార్థుల సర్టిఫికెట్ల పై సంతకాల దృష్ట్యా ప్రిన్సిపల్ పదవుల్లో తిరిగి కాంట్రాక్టు అధ్యాపకులను నియమించాలని లేదా పర్మనెంట్ అధ్యాపకులను జిల్లా పీజీ కాలేజీలకు బదిలీ చేయాలన్నారు.